క్లుప్తంగా

ఘనంగా గాంధీ జయంతి



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం ఆర్యవైశ్యులు మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టిసుదర్శన్, ఆర్యవైశ్యులు రామాంజనేయులు, ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ఖాజీపేటలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఖాజీపేట ఆర్యవైశ్య వాసవీ క్లబ్ అధ్వర్యంలో ఖాజీపేట బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహానికి కమిటీ సభ్యులు పూల మాల వేసి నివాళి అర్పించారు. వాసవీక్లబ్ సభ్యులు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, వీరయ్య, సుబ్బారావు దరిసా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్, సీఐ

బద్వేలు అర్బన్ : క్రీడల్లో రాణించే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ సీఐ లింగప్ప పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన భగత్‌సింగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చిన్ని, వీరనాలశివ కుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, పట్టణ నాయకులు ఓబుల్‌రెడ్డి, సుధాకర్, సురేష్, నాగేంద్ర, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలను నియంత్రించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలను తరలించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శివానగర్‌కు చెందిన దిరసవంచ కేశవ అనే యువకుడు కుక్కకాటుకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి బాధితుడితో, వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట వీధికుక్కలు చిన్నారులు, వృద్ధులు, ప్రజలపై దాడులు చేస్తున్నాయని, తక్షణమే సిబ్బందిని నియమించి వీధికుక్కలను పట్టణానికి దూరంగా తరలించాలని కోరారు.


స్వచ్ఛందంగా రక్తదానం చేయండి



రక్తదాన శిబిరంలో న్యామతుల్లా, ఉమర్

రాజుపాళెం : ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆర్నాల్డ్ జిమ్ న్యామతుల్లా అన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బ్లడ్ డోనార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా, దస్తగిరి స్వామి పండుగ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనార్స్ ఫౌండేషన్ ఫౌండర్ మహమ్మద్ ఉమర్, టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ నేతలు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వాసుదేవరెడ్డి నూతన గృహప్రవేశ వేడుకల్లో గురువారం బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేలు డాక్టర్ దాసరి సుధ, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో తీర్థప్రసాదాలు స్వీకరించి వాసుదేవరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా కార్యదర్శులు పోలిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అట్లూరు, గోపవరం మండలాల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, మాజీ డైరెక్టర్ బాలమునిరెడ్డి, మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు సునీల్, సాక్షి అడ్వర్‌టైజ్‌మెంట్ రీజనల్ మేనేజర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్: గ్రామోత్సవంలో అమ్మవారు



ప్రొద్దుటూరు కల్చరల్: శమీదర్శనానికి వెళ్తున్న పార్వతీదేవి



ఊరేగింపులో ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం అమ్మవారు



బద్వేలు అర్బన్ : అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



మైదుకూరు భీమేశ్వరస్వామి ఆలయంలో విజయలక్ష్మీదేవిగా పార్వతీదేవి



ప్రొద్దుటూరు కల్చరల్: రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఊంజల్ సేవ

పాపశమని.. శత్రు వినాశిని

దసరా పండుగను గురువారం అత్యంత ఉత్సాహంగా, సంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకున్నారు. దసరా మహోత్సవాల్లో భాగంగా గురువారం శమీదర్శనం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం ఆవరణలో గల జమ్మివృక్షం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరి ఆలయం (అమ్మవారిశాల), కోదండ రామాలయం, మహాలక్ష్మీదేవి ఆలయం, వీరభద్రస్వామి ఆలయం, పోలీసుస్టేషన్ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. విగ్రహాలను జమ్మివృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేయించి తిరిగి ఆలయాలకు చేర్చారు. -బద్వేలు అర్బన్



బ్రహ్మంగారిమఠం: అమ్మవారిశాలలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డిని సత్కరిస్తున్న అర్చకులు



పోరుమామిళ్ల: ఊంజల్‌సేవలో వాసవీమాత



ఖాజీపేట: లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం



కలసపాడు: విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



కోలాటం ఆడుతున్న మహిళలు



రాజుపాళెం: వెల్లాలలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



బ్రహ్మంగారిమఠం : ప్రత్యేక అలంకరణలో ఈశ్వరీదేవి



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న శ్రీ వెంకటాద్రిస్వామి

రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

బద్వేలు అర్బన్ : రాజకీయంగా ఎదుర్కోలేకనే ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసుతో జైలుకు వెళ్లి ఇటీవల బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డిని గురువారం తిరుపతిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడం, అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సౌమ్యులు, మితభాషి అయిన మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించడం ద్వారా కూటమి నేతలు ప్రజల్లో విలువ లేకుండా చేసుకున్నారని విమర్శించారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు.

సత్కారం

పోరుమామిళ్ల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని నియమించడంతో శుక్రవారం రంగసముద్రం పంచాయతీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మినారాయణ రెడ్డి, ఎంపీటీసీ చెంద్రాయుడు, పార్టీ నాయకులు జగన్మోహనాచారి, బాలుడు, రాజారెడ్డి, మాల కొండయ్య, గిరిప్రణీత్‌రెడ్డి, సాయి నారాయణరెడ్డి, రాజీవ్‌బాషా పాల్గొన్నారు.

శ్మశానవాటికల స్థలాలను గుర్తించండి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లేశ్వరి

బి.కోడూరు : మండలంలోని పది పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శ్మశానవాటికలు లేవని పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశానవాటికల సర్వే నంబర్లు, వాటి విస్తీర్ణాలను తెలియజేయాలని మండల అభివృద్ధి అధికారి మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం మండలంలోని మేకవారిపల్లె సచివాలయంలో సర్పంచ్ పెద్దిరెడ్డి రమణమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ మల్లేశ్వరి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో మూలవారిపల్లె, పందివీడు, అంకనగొడుగునూరు గ్రామాల్లో శ్మశానవాటికలకు సంబంధించి స్థలాలు లేవని, రహదారులు కూడా లేదని, శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలని, దారులు కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులను ఉద్దేశించి ఎంపీడీఓ మాట్లాడుతూ శ్మశానవాటికలపై ఫిర్యాదులు అందాయని, శ్మశానవాటికలకు సంబంధించి సర్వేనెంబర్లు, విస్తీర్ణం తెలపాలని మండల తహసీల్దారు దృష్టికి తీసుకెళ్ళామని, త్వరలో సమస్యను పరిష్కరించడంతో పాటు శ్మశానవాటికల అభివృద్ధి కోసం చేతిపంపు, ఒక రూము, ప్రహరీలను ఉపాధి నిధుల ద్వారా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈఓ బ్రహ్మానందరెడ్డి, వీఆర్‌ఓ పీరయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రమోహన్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిది



వెంకటరమణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కలసపాడు : ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదని ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ బోడెల సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీవిరమణ పొందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణారెడ్డి విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని కొనియారు. విద్యార్థులకు భౌతిక శాస్త్రంలో వినూత్న ప్రయోగాలు చేపట్టి జాతీయ స్థాయికి ఎదిగే విధంగా కృషి చేశారని ప్రశంసించారు. అలాగే పాఠశాలలో నిర్వహించిన జోనల్ ఆటల పోటీలు సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఎంఈఓ మస్తాన్‌వలి మాట్లాడుతూ రమణారెడ్డి అంకితభావంతో విధులు నిర్వర్తించారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణయ్య, గోపవరం ఎంఈఓ రఘురామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రుద్రమూర్తి, మెర్సీమాలిని, బాల అంకిరెడ్డి, వెంకటరామిరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం ఎన్.తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుబ్బ చంద్రశేఖర్, అంకన గురివిరెడ్డి, సగిలి సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, ఎ.వి.భాస్కర్‌రెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లాభదాయకం



రైతులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గోపవరం : వ్యవసాయ యంత్రాలపై 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించడం వలన రైతులకు వ్యవసాయ పరికరాల కొనుగోలుపై లాభదాయకంగా ఉంటుందని ఏఓ విజయరావు పేర్కొన్నారు. శుక్రవారం రాచాయపేట రైతుసేవా కేంద్రం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతులతో కలిసి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు వలన ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు కొనుగోలుపై రైతులకు భారం తగ్గుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్‌డీ హసీనా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెరుగైన ఫలితాలు సాధించాలి

మైదుకూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పరికరాలపై తగ్గించిన జీఎస్టీతో రైతులు పంటల సాగులో మెరుగైన ఫలితాలను సాధించాలని మైదుకూరు ఏడీఏ ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మైదుకూరులో సూపర్ జీఎస్టీ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ జీఎస్టీ అధికారులు వ్యవసాయ ట్రాక్టర్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి శ్రీకృష్ణ దేవరాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయ ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలు, వ్యవసాయ డ్రోన్లు, ఆక్వాకల్చర్ పరికరాలు, డ్రిప్ పరికరాలు, 12 రకాల బయోపెస్టిసైడ్స్, పాలక్యాన్లు తదితర వాటిపై జీఎస్టీ 13 శాతం నుంచి 5 శాతానికి ప్రభుత్వం తగ్గించిందన్నారు. సీటీఓ జ్ఞానానంద రెడ్డి, డీసీటీఓ హనుమంతు, నోడల్ అధికారి చక్రానాయక్, ఎంపీడీఓ కేవీ శ్రీధర్ నాయుడు, ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, హెచ్‌ఓ సి.రామకృష్ణ, ఎంపీపీ కడప థామస్, సిండికేట్ బ్యాంక్ చైర్మన్ పాశం మారుతి పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

మైదుకూరు : మైదుకూరు మండల పరిషత్ సమావేశం శుక్రవారం నామమాత్రంగా జరిగింది. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు అధికారులు తమ శాఖ ద్వారా జరిగిన అభివృద్ధి పనులను, ప్రగతిని వివరించారు. పలువురు సర్పంచ్‌లు ఆయా పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ థామస్ తదితరులు పాల్గొన్నారు.

ధన్యవాదాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : దసరా ఉత్సవాలను జయప్రదం చేసినందుకు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు అందరికి ధన్యవాదాలు తెలిపారు. దసరా ప్రారంభం నుంచి ముగింపు వరకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేశారని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రికల్, మున్సిపాలిటీ, పోలీసు, ఫైర్, రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించామని తెలిపారు. ఇందుకు సహకరించిన అన్నిశాఖల వారికి ఆర్యవైశ్య సభ తరపున ధన్యవాదాలు తెలిపారు.

ఆలయానికి విరాళం



రూ.లక్ష చెక్కు అందిస్తున్న వంశీ విజయ్

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి శుక్రవారం కర్నూలుకు చెందిన నాగినేని శంకరయ్య జ్ఞాపకార్థం భార్య జయమ్మ, కుమారుడు వంశీ విజయ్ రూ.100116 విరాళంగా ఇచ్చారు. వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శాలువ కప్పి సత్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మినారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం.. భక్తజన సంద్రం



బ్రహ్మంగారిమఠంలో గ్రామోత్సవం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం భక్తజన సంద్రంగా మారింది. విజయదశమి వేడుకలు అంగరంగ అంగరంగ వైభవంగా జరిగాయి. శమీ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీ గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి, అమ్మవారికి పూర్వపు మఠాధిపతి జ్యేష్ఠ పుత్రుడు శ్రీ వెంకటాద్రి స్వామి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను వాహనంపై కొలువు దీర్చి జమ్మి చెట్టు వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడ పూజలు చేసి, తిరిగి మఠానికి ఊరేగింపు చేశారు. అనంతరం కలశోత్సవం కమనీయంగా జరిగింది. పండుగ రోజు మహాప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామి, అమ్మవారిని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సభ్యులు, పుట్టా ఆనంద్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు.

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో..

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో విజయదశమి శమీ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ ఈశ్వరీదేవి ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి పూజలు నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'



అట్లూరు: డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నాయకులు



పోరుమామిళ్ల: డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్' యాప్ ఉంటుందని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన అట్లూరులో జగనన్న డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెడ్ బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పని చేస్తుందన్నారు. డిజిటల్ బుక్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు, దాడులు జరిగితే వాటి ఫొటోలు, దాడి జరిగిన సంఘటనలు డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేసి లోకేషన్ షేర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పొన్నపోలు బ్రహ్మానందరెడ్డి, వంకెల పోలిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజవోలు సుబ్బారెడ్డి, సర్పంచు ఆర్‌వీ సుబ్బారెడ్డి, నాయకులు రమణారెడ్డి, నాగం నరసారెడ్డి, ఇరగంరెడ్డి భాస్కర్‌రెడ్డి, గజ్జల నరసారెడ్డి, మద్దిక చిన్న మునిరెడ్డి, శ్యాం సుందర్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిక చిన్న మునిరెడ్డి, కుమార్తె శిరీష, సుదర్శన్‌రెడ్డి వివాహం శుక్రవారం కామసముద్రం గ్రామంలో జరిగింది. ఈ వివాహానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సుధ వధూవరులను ఆశీర్వదించారు.

పోరుమామిళ్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ జైలుకు పంపుతూ భయభ్రాంతులను చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్‌లతో కలసి నాగార్జునరెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్టులను, మీడియా ప్రతినిధులను అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. టీడీపీ రెడ్‌బుక్ అరాచకాల బారిన పడిన ప్రతిఒక్కరికి వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రెడ్ బుక్ రాజ్యాంగం పర్యావసనాలను గుర్తించుకునేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట భద్రత



డ్రోన్ కెమెరా ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. అలాగే మహిళలను రక్షణ కల్పించేందుకు శక్తి టీంలను నియమించారు. శక్తి టీంలోని మహిళా పోలీసులు మఫ్టీలో ఉంటూ ఆకతాయిల కదలికలపై నిఘా పెట్టారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఐడీ పార్టీ, స్పెషల్ పార్టీ, మొబైల్ పార్టీలతో భద్రతను ఏర్పాటు చేశారు. అమ్మవారి శమీదర్శనం, తొట్టిమెరవని సందర్భంగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు కట్టుదిట్టమైన పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. శమీదర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో డీఎస్పీ భావన పోలీసు భద్రతను పర్యవేక్షించారు. డీఎస్పీ భావన, సీఐలు సదాశివయ్య, తిమ్మారెడ్డి, వేణుగోపాల్, ట్రాఫిక్ సీఐ రాజగోపాల్‌లు, ఎస్ఐలు బందోబస్తును పర్యవేక్షించారు. దసరా ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రొద్దుటూరు : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నూతన షిఫ్ట్ ఆపరేటర్ల సమాన పనికి సమాన వేతనం సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీఎస్‌పీఈ జేఏసీ జిల్లా చైర్మన్ యూఎస్‌కే బర్నబాస్‌కు వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో గత ప్రభుత్వం 2500 మందికిపైగా షిఫ్ట్ ఆపరేటర్లను నియమించిందన్నారు. ఆపరేటర్లకు రూ.18,500 మాత్రమే వేతనంగా నిర్ణయించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఒకే సబ్‌స్టేషన్‌లో ఒకే రకమైన డ్యూటీ చేస్తున్న ఆపరేటర్ల మధ్య వేతన వ్యత్యాసం సరిచేయాలని తెలిపారు. మా అందరికి రూ.27,953 వేతనం అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు షరీఫ్, నూతన షిఫ్ట్ ఆపరేటర్ల సమాన పనికి సమాన వేతనం సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ గొడ్డవీటి నాగరత్నాచారి, వెంకటరామయ్య, శశిధర్ రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు సబ్ డివిజన్‌లోని మైదుకూరు, చాపాడు మండలాలు, వనిపెంట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఎ.రామభద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు సబ్ స్టేషన్ పరిధిలో కడప రోడ్డు 11 కేవీ ఫీడర్, నంద్యాలంపేట సబ్ స్టేషన్ పరిధిలో జీవీ సత్రం 11 కేవీ ఫీడర్, ఉప్పుగుంటపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పుగుంటపల్లె 11 కేవీ ఫీడర్‌లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వనిపెంట సబ్‌స్టేషన్ పరిధిలో వనిపెంట 11 కేవీ టౌన్ ఫీడర్, ఎల్లంపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్ 11 కేవీ ఫీడర్, చాపాడు సబ్‌స్టేషన్ పరిధిలో చాపాడు 11 కేవీ ఫీడర్, అన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో అన్నవరం 11 కేవీ ఫీడర్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చాపాడు : మండల పరిధిలోని చాపాడు, అన్నవరం గ్రామాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏఈ రామభద్రయ్య తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణగా చాపాడు, అన్నవరం ఫీడర్లలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.